క్లుప్తంగా

ఆకట్టుకున్న యక్షగాన నృత్యరూపకం



యక్షగాన నృత్య రూపకం ప్రదర్శన

భీమవరం: స్థానిక భారతీయ విద్యాభవన్స్ పాఠశాలలో మంగళవారం ప్రదర్శించిన యక్షగాన నృత్య రూపకం వీక్షకులను అలరించింది. కర్ణాటకకు చెందిన ప్రముఖ యక్షగాన కళాకారుడు శివప్రసాద్ హెగ్డే ఆధ్వర్యంలో 15 మంది నృత్య కళాకారులతో ఈ ప్రదర్శన చేశారు. భవన్స్ చైర్మన్ విశ్వనాథరాజు, సెక్రటరీ శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

పోడూరు తహసీల్దార్‌కు అభినందనలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి సభ్యత నమోదు ద్వారా సేకరించిన లక్ష రూపాయల డ్రాఫ్టును పోడూరు తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చదలవాడ నాగరాణికి అందించారు. పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం ఈ డ్రాఫ్టును అందజేయడంతో ఆమె తహసీల్దార్‌ను అభినందరించారు. కార్యక్రమంలో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఈఓ ఇ.నారాయణ, సమగ్ర విద్య ఏపీసీ పి.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

వీరవాసరం: స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్లు వీరవాసరం కాపు సర్వీస్ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వీరవాసరంలో ఆరు ఎలిమెంటరీ స్కూల్ లోని విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ తెలిపారు. ఆగస్టు 15 సందర్భంగా హైస్కూల్లో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు బి.లక్ష్మీకళ్యాణి, సభ్యులు కుంచె వేణు, అనిశెట్టి అన్నపూర్ణ, బృందావనం నాగేంద్ర పాల్గొన్నారు.

కాలుష్య కాసారంగా యనమదుర్రు డ్రెయిన్

- అన్ని వ్యర్థాలు డ్రెయిన్‌లోకే వదులుతున్న వైనం
- ఆక్వా పరిశ్రమలతో మరింత ఇబ్బంది



వ్యర్థ జలాలను పైపులైన్ పెడుతున్న ఆక్వా పరిశ్రమ యాజమాన్యం (ఫైల్)



కలుషితమైన యనమదుర్రు డ్రెయిన్‌లో స్నానం చేస్తున్న దిగువ గ్రామస్తులు (ఫైల్)

భీమవరం అర్బన్: ఒకప్పుడు జీవనదిగా ఉన్న యనమదుర్రు డ్రెయిన్ కలుషిత నీటితో మూలుగుతుంది. డ్రెయిన్ ఆనుకుని పుట్టగొడుగుల్లా ఆక్వా పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో కలుషిత నీటితో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో యనమదుర్రు డ్రెయిన్ నుంచి ముక్కుపుటలు బద్దలయ్యేలా దుర్వాసన రావడంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, దెయ్యాలతిప్ప, గొల్లవానితిప్ప, తోకతిప్ప, లోసరి, నాగిడిపాలెం తదితర గ్రామాలు ఆనుకుని ఉన్నాయి. ఆయా గ్రామాలలో సుమారు 30 వేల మంది జనాభా వరకు నివసిస్తున్నారు. గత మూడు దశాబ్దాలు క్రితం యనమదుర్రు డ్రెయిన్‌లోని నీటిని తాగునీటి గానూ, ఇంటి వాడకానికి ఈ ప్రాంత ప్రజలు వాడేవారు. పూర్వీకులు గోస్తనీ నది జలాలుగా ప్రత్యేక పూజలు నిర్వహించే వారని స్థానికులు చెబుతున్నారు. యనమదుర్రు డ్రెయిన్ దుర్గంధం వల్ల పరివాహక గ్రామస్తులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేలాది రూపాయలు ఆస్పత్రుల పాలు చేస్తున్నామని వాపోతున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆక్వా పరిశ్రమలు

యనమదుర్రు డ్రెయిన్ ఎగువన రొయ్య తలకాయల ఫ్యాక్టరీలు, ఆక్వా పరిశ్రమలు ద్వారా విడుదలైన రసాయనాలతో యనమదుర్రు డ్రెయిన్ కలుషితమైంది. ఇది చాలదన్నట్లు ఎగువన భీమవరం పట్టణంలోని చెత్త, చెదారం, సెప్టిక్‌ట్యాంకులు, డ్రెయినేజీ నీటిని ఈ డ్రెయిన్‌లోనే విడుదల చేస్తున్నారు. దీంతో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోని పలు డ్రెయిన్‌లు రసాయనాలతో కలుషితమైపోతున్నాయి. దీంతో ఆ కాలువల్లో ఉన్న అపారమైన మత్స్య సంపద దెబ్బతినడంతో వేలాది మత్స్యకారులు రోడ్డున పడుతున్నారు. రోజుకొకటి పుట్టగొడుగుల్లా డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో ఆక్వా పరిశ్రమలు, రొయ్యలు షెడ్డులు ఏర్పాటు చేయడంతో వాటినుంచి విడుదలయ్యే కలుషిత నీరు డ్రెయిన్‌లోనే వదులుతున్నారు.

డ్రెయిన్ శుద్ధి ఎప్పుడో?

2016లో టీడీపీ ప్రభుత్వంలో యనమదుర్రు డ్రెయిన్‌ను రూ.100 కోట్లతో ప్రక్షాళన చేస్తామని సభలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులు బల్లగుద్ది చెప్పినప్పటికీ అవేమి క్షేత్రస్థాయిలో జరగలేదు. డ్రెయిన్ నుంచి దుర్వాసన రావడంతో తీర ప్రాంత గ్రామాలైన నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, గూట్లపాడు, తోకతిప్ప, బర్రువానిపేట, గొల్లవానితిప్ప దిరుసుమర్రు, యనమదుర్రు గ్రామాల ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని వేలాది రూపాయలు ఆస్పత్రులకే ఖర్చు చేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యనమదుర్రు డ్రెయిన్‌లోకి కలుషితమైన నీటిని విడుదల చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పరివాహక గ్రామస్తులు కోరుతున్నారు.

తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాం

డ్రెయిన్ నుంచి వెలువడే దుర్గంధం వల్ల తరచూ చిన్నపిల్లలు నుంచి వృద్ధులు వరకు అనారోగ్యానికి గురవుతున్నాం. అంతేకాకుండా దోమలు ప్రబలి రాత్రులు కంటి మీద కునుకు పట్టడం లేదు. చాలామంది 50 నుంచి 60 ఏళ్ల మధ్య వృద్ధులు ఊపిరితిత్తుల వ్యాధులతో చనిపోతున్నారు. నెలకు వేలాది రూపాయలు ఆస్పత్రులకే ఖర్చు పెట్టాల్సి వస్తుంది.

– ఎస్.నెలబాలుడు, గ్రామస్తుడు, నాగిడిపాలెం

30న డీఎన్నార్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 30న ఏర్పాటు చేసినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి హాజరుకావాలని కళాశాల పూర్వ విద్యార్థి కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆహ్వానించామని పేర్కొన్నారు.

ఉల్లాస్ 'అక్షరాంధ్ర' పై శిక్షణ

కాళ్ల: ఉల్లాస్ 'అక్షరాంధ్ర' – అక్షరాస్యతా కార్యక్రమంపై వలంటీర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం డీఆర్డీఏ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండలంలోని పెదఅమీరంలోని మండలసమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ అక్షరాస్యత కార్యక్రమం జిల్లా అంతటా ఆగస్టు నుంచి మార్చి వరకు నిర్వహిస్తారని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌కు పరామర్శ



ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పరామర్శిస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు శివకుమార్

కాళ్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను పశ్చిమగోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కొండేటి శివకుమార్ మంగళవారం పరామర్శించారు. పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచారంలో టీడీపీ గూండాల దాడిలో గాయపడిన రమేష్ యాదవ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. బీసీలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గ్రహిస్తున్నారని త్వరలో రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కొండేటి శివకుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్‌వలీ

ఆకివీడు: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు రాజకీయ ఒత్తిడులతో ముస్లింల మనోభావాల్ని దెబ్బతీసే విధంగా ఐదుగురు సభ్యులతో ముస్లిం సంరక్షణ కమిటీని ఏర్పాటు చేయడం దారుణమని ఏఎంసీ మాజీ చైర్మన్, స్థానిక అన్సారీ మసీద్ కమిటీ అధ్యక్షులు ఎండీ. మస్తాన్‌వలీ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా అయన నివాసంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏకపక్షంగా రాజకీయ దురుద్దేశపూర్వకంగా కమిటీని ఏర్పాటు చేశారన్నారు. దీనిని రద్దు చేయకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనన్నారు. పట్టణంలో మూడు మసీదులకు మూడు కమిటీలున్నాయని, ఆయా మసీదులు, షాపింగ్‌కాంప్లెక్స్ ద్వారా వచ్చే ఆదాయంతో పేద ముస్లింలకు, అభివృద్ధి కార్యక్రమాలకు చైర్మన్ ఎండీ.మదనీ వెచ్చిస్తూ పనిచేస్తున్నారని చెప్పారు. పదవీదాహంతో ముస్లింల మధ్య చిచ్చుపెట్టి, ఒత్తిడితో నూతన కమిటీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. పట్టణంలో రెండు కమిటీలను సంప్రదించి, తమ కమిటీకి తెలియకుండా కొత్త కమిటీ వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కమిటీని రద్దు చేసి, అన్ని కమిటీలను సంప్రదించి నూతన కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ గౌరవధ్యక్షుడు ఎస్కే సుభానీ, ఎండీ బాషీద్, షేక్ మీరా, కోశాధికారి నాగూర్ మీరా, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, షేక్ బాబ్జన్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కాళ్ల: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పొడిచేసి నీళ్లలో కలిపి చిన్నారులకు అందించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్.రంగంనాయుడు, డాక్టర్ ఎస్. సునీల్, ఐసీడీఎస్ సీడీపీఓ వి.వాణీవిజయరత్నం తదితరులు మాట్లాడుతూ ప్రతి బిడ్డ పరిశుభ్రత పాటించాలని, బహిరంగ మలవిసర్జన చేయరాదన్నారు. మాత్రాల వల్ల రక్తహీనత తగ్గి, పోషకాల గ్రాహ్యత పెరుగుతుందన్నారు. మండలంలో మొత్తం 10,152 పిల్లలకు గానూ 9,344 మందికి మాత్రలు మింగించి 92 శాతం పూర్తి చేశామన్నారు.



కోపల్లెలో చిన్నారులకు మాత్రలు వేయిస్తున్న సీడీపీఓ వాణీవిజయరత్నం

కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ పాల్సన్, ఎంఎల్‌హెచ్‌సీలు ప్రశాంతి, శిరీష, ఏఎన్ఎమ్ లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో యువకులదే కీలక పాత్ర



భీమవరంలో 400 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



వీరవాసరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: నాటి స్వాతంత్ర్యోద్యమంలో యువకులే కీలకపాత్ర వహించారని జాతి కుల,మత బేధం లేకుండా జాతీయ సమైక్యత భావంతో యువత పాల్గొన్నారని డిప్యూటీ కలెక్టర్ బి.నారాయణరెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా 400 అడుగుల జాతీయ జెండాతో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: వీరవాసరంలో తిరంగా ర్యాలీని మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. వీరవాసరం పశ్చిమ కాలువ నుంచి తూర్పు చెరువు సెంటర్ వరకు లిటిల్ బర్డ్స్ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని, డీసీ చైర్మన్ ఆకుల లీలాకృష్ణ, ఎంపీడీవో అప్పారావు, తహసీల్దార్ ఏవి రామాంజనేయులు, చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: దేశ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. కోలమూరు, ఉండి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన యాత్రలో విద్యార్థులు, దేశభక్తులు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కోలమూరులో నిర్వహించిన యాత్రలో బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ పేరిచర్ల శ్రీనివాసరాజు (సుభాష్‌రాజు)హర్ ఘర్ తిరంగా యాత్రకు ప్రాతినిధ్యం వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వరరాజు, మండలాధ్యక్షుడు యర్రా విక్రమ్, ప్రధాన కార్యదర్శి మడిచెర్ల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం 11 కేవీ ఫీడర్‌పై ఆర్‌డీఎస్ఎస్ పనులు, లైన్లు మరమ్మత్తులు నిమిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెదగరువు, చినగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు, దూసనపూడి, కమతాలపల్లి, బాలేపల్లి, మత్స్యపురిపాలెం, దిరుసుమర్రు, పల్లిపాలెం గ్రామాలతో పాటు తుందుర్రు గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కునకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆకివీడులో..

ఆకివీడు: చినకాపవరం సబ్ స్టేషన్ పరిధిలో పెదకాపవరం 11కేవీ లైన్లపై ఉన్న చెట్లు తొలగింపు, మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. చినకాపవరం, పెదకాపవరం, క్షత్రియపురం, తదితర ప్రాంతాల ఆక్వా రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సహజసిద్ధ వనరులతో స్వయం ఉపాధి

కాళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే సహజ సిద్ధమైన వనరులను సద్వినియోగం చేసుకుంటే గ్రామీణ యువత ఎన్నో స్వయం ఉపాధి పథకాలు చేపట్టవచ్చునని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో జక్కరం పంచాయతీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల్లో పంట కాలవలు లభ్యమయ్యే గుర్రపుడెక్క, వీడ్ వంటి వాటిలో ఎన్నో సహజ సిద్ధమైన ఔషధ గుణాలు ఉన్నాయన్నారు. వాటిని ఉపయోగించి చేపలమేత, కోళ్ల మేత, చేప నుండి నూనె తీయడం, ఆక్వా చెరువులు వాటర్ టెస్టింగ్ వంటి వాటిపై తమ కళాశాలలో సాంకేతికంగా శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.పద్మావతి, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, జి.హరీష్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

16న భీమవరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఆనంద ఫంక్షన్ హాల్లో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ్‌రాజు తెలిపారు. మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో కార్యక్రమ వివరాలను పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. 16న ఉదయం 6 గంటల నుంచి విజయవాడ హరేకృష్ణ గోకుల క్షేత్రం వారి సమక్షంలో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో బాలలకు మధ్యాహ్నం 12 గంటల నుంచి అనేక పోటీలను నిర్వహిస్తున్నామని, శ్రీకృష్ణుని వేషధారణలు, చిత్రలేఖనం, స్వామి కీర్తనలు, ఇత్యాది పోటీలు నిర్వహిస్తామని, అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు 98491 33457, 94403 42699, 9440895404 నంబర్లకు ఫోన్ చేయాలని వివరించారు. మహత్రవ దాసు, కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, దాయన చంద్రాజి పాల్గొన్నారు.

ముస్లిం అభివృద్ధి కమిటీ ఏర్పాటు

ఆకివీడు: ముస్లిం సంక్షేమ, అభివృద్ధికి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫైవ్ మెన్ కమిటీలో అధ్యక్షులుగా డాక్టర్ ఎండీ.బిలాల్ మొహ్మద్, కార్యదర్శిగా ఎండీ. ఖాజా మొహిద్దీన్, సభ్యులుగా హైదర్ అలీ ఖాన్, షేక్ బాబ్జన్, షేక్ మొహ్మద్ పరాద్ అలీలను నియమిస్తూ ఏపీ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి జనాబ్ షేక్ మహ్మద్ అలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేశాలను జిల్లా కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారి, ఎస్పీ జిల్లా వక్ఫ్, మైనార్టీ అధికారులకు, మండల తహశీల్దార్, ఎస్ఐలతో పాటు కమిటీ ప్రతినిధులకు కాపీలు జారీ చేశారు. దీంతో బిలాల్‌ను ఆయన నివాసం వద్ద ముస్లింలు కలిసి అభినందనలు తెలియజేశారు.

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా

ఆకివీడు: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురు వ్యక్తులకు భీమవరం స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రూ. 50 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి, వారిపై ఎస్సై హనుమంతు నాగరాజు కేసు నమోదు చేశారు. దీనిపై ఒకొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చినట్లు వివరించారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

భీమవరం: విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. పట్టణంలోని శ్రీగ్రంధి వెంకటేశ్వరరావు(జీవీఆర్) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి జి.ప్రభాకరరావు, డీఎల్ఏటీవో డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ఉండి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎ.శైలజకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ద్వారంపూడి నారాయణ రెడ్డి, సత్తి బ్రహ్మారెడ్డి,ముదునూరి సూర్యకుమారి తదితరులు రూ.25 వేలు అందజేశారు. మంగళవారం ఈ సాయాన్ని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు,పెన్మత్స రంగప్రసాదరాజు విద్యార్థినికి అందజేశారు.

క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అవసరం



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అవసరమని కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ చెప్పారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అచీవర్స్ డే కార్యక్రమంలో ఆయన ఉద్యోగాలు సాధించిన కాలేజీ విద్యార్థులను సత్కరించారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు, ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి ఎన్.సుగుణ రెడ్డి, చైర్మన్ ఎన్.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.